కొంగొత్త ఆశలతో ముందుకెళ్దాం

ఆలూరు: గతాన్ని వదిలి కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో ముందుకెళ్దామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. 2023లో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లా, నియోజకవర్గం ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని ప్రజలకు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బంది, కార్మికులకు, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నూత న సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వుండాలని ఆకాంక్షించారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

పత్తికొండ: నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆకాంక్షించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 1వ తేదీ ఆదివారం తాను పత్తికొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం వరకు అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య న్యూఇయర్ వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

కృష్ణగిరి: మండల ప్రజలకు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజీనామాలు ఉత్త పుకార్లే

హొళగుంద: వైఎస్సార్‌సీపీకి కొందరు రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న పుకార్లు ఉత్తవేనని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంగళదహాళ్ ప్రహ్లాదరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఓ సర్పంచ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కొందరు ప్రచారం చేశారని, అయితే ఏదో కారణం చేత అలిగిన విషయంపై రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి పుకార్లు సర్వ సాధారణమేనని, ఒక వేళ పార్టీకి చెందిన వారిలో అసంతృప్తి ఇతర విభేదాలు ఉంటే కుటుంబ సభ్యులా కూర్చొని పరిష్కరించుకుంటామని చెప్పారు. ఇటవలే కాలంలో ఇలాంటి పుకార్లు ఎక్కువయ్యాయని అలా రాజీనామాలు జరిగిన సంఘటనలు ఎక్కడా జరగలేదన్నారు. హొళగుంద మండలంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాగాల్లో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంనాయకత్వంలో పార్టీ బలోపేతమైందన్నారు.

వాహనాల వేలాల్లో రూ.5.70 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 26 వాహనాలకు సెబ్ కార్యాలయ అవరణలో శనివారం నంద్యాల సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు ప్రభుత్వ నిర్ణయ ధర రూ.2,55,500లు కాగా ధర రూ.4,86,500లు పలికినట్లు తెలిపారు. జీఎస్టీ విలువ రూ.87,570తో కలిసి మొత్తం వచ్చిన ఆదాయం రూ.5,70,070లు అని చెప్పారు. సెబ్ సీఐ జయరాంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

కృష్ణగిరి: రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే చేపట్టి రైతులకు న్యాయం చేసేందుకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం అమలు చేస్తున్నారన్నారు. కృష్ణగిరి మండలంలోని 15 రెవెన్యూ గ్రామాలకు గాను మొదటి విడత కింద 9 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన సర్వేను అందరి సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేనే పోటీచేస్తా

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



పాల్గొన్న కన్వీనర్లు

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తెలిపారు. తనకు ఎమ్మెల్యేగా మరో సారి అవకాశం ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరుతానని చెప్పారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో పట్టణంలోని సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న సంక్షేమ ప్రభుత్వ పాలనలో సచివాలయ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు భాగస్వాములై సంక్షేమ సారథుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభు త్వం పార్టీలు, కులాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావులేకుండా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా అందిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రతి సచివాలయానికి ముగ్గురు వైఎస్సార్ సీపీ కన్వీనర్లను నియమించామని చెప్పారు. ప్రతి వలంటీర్ 50 ఇళ్లకు ఇద్దరు గృహసారథులను ఎంపిక చేయాలని, ఈప్రక్రియ ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అండగా ఉండి ప్రభుత్వానికి జవాబు దారీగా, మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మ ద్,వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్ కుమార్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పథకం రైతులకు వరం

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రైతుల పాలిట వరమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, నందవరం మండలాలకు చెందిన రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడు సర్వే చేస్తున్నారని, సర్వే పూర్తైన గ్రామాల్లోని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగానే భూ సర్వే చేస్తుందని, ఇక మీదట భూ రికార్డులు, హద్దుల గూరించి సమస్య రాకుండా పక్కాగా ఉంటుందని చెప్పారు. అనంతరం రైతులకు భూ హక్కు పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, జానకి రామిరెడ్డి, శివప్పగౌడ్, విరుపాక్షిరెడ్డి, భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆలూరు: మండలంలోని పొదుపు సంఘాల మహిళలు పెరటికోళ్ల పెంపకం చేపట్టి ఆర్థికంగా ఎదగాలని దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ అన్నారు. స్థానిక మహిళా సంఘం కార్యాలయంలో శనివారం ఏపీఎం రమేష్ ఆధ్వర్యంలో మండలానికి మంజూరైన వంద యూనిట్లను అందజేశారు. ఒక్కో యూనిట్‌లో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయన్నారు. ప్రధానంగా బాలింతలు, గర్భిణులు, ఎదుగుదల లేని చిన్నారులకు పెరటికోళ్ల గుడ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవసాయం, శ్రీరాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు పెరటి కోళ్లను అందజేసిన జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

యువకుడి ఆత్మహత్య

వెల్దుర్తి: చెరుకులపాడు గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు (23) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు.. శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రించిన శ్రీనివాసులు శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. పెళ్లైన నెలకే భార్య వదిలేసి పోయి నాలుగేళ్లయినా కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెంది తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

తుగ్గలి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం తుగ్గలిలో ఎంపీటీసీ సభ్యుడు రాజుతో కలిసి వైఎస్సార్ జలకళ బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల పొలాల్లో బోర్లు వేస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వామి భక్తుల ఆందోళన

పత్తికొండ రూరల్ : తెలంగాణలో ఒక సభలో బైరి నరేష్ అనే వ్యక్తి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అయ్యప్ప గురించి మాట్లాడారని అయ్యప్ప భక్తులు శనివారం ఆందోళన చేశారు. స్థానిక అయ్యప్ప దేవాలయం నుంచి మాలధారులు నాలుగు స్తంభాల కూడలి, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. బైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ రీసర్వే పక్కాగా నిర్వహించండి

మద్దికెర : రైతులు భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా భూ రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని హంప, పెరవలి గ్రామాలలో జరుగుతున్న సర్వే పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేయర్లు, వీఆర్వోలు ప్రభుత్వ రికార్డుల ప్రకారం కొలతలు నమోదు చేయడమే గాకుండా వారి పాస్‌బుక్‌లను కూడా పరిశీలించాలన్నారు. వీఆర్వోలు రషీద్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

ఆలూరు రూరల్: విద్యార్థుల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బంగారు బాట వేశారని ఎంపీపీ శ్రీరాములు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ అన్నారు. ఆలూరు మండలంలోని పెద్దహోతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ దేవరాజు, కో-ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా హాజరయ్యారు. అలాగే మండలంలోని మొలగవల్లి జెడ్పీ పాఠశాలలో ఎంపీపీ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ వైఎస్ చైర్మన్ ఈరన్న, పీఎంసీ చైర్మన్ రామాంజి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలోని జెడ్పీ స్కూలులో హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో 8వ తరగతి 77 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి పంపిణీ చేశారు.

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్‌లో విద్యార్థులకు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, గాజులదిన్నె సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

చిప్పగిరి: మండలంలోని బంటణాహాలు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం విజయరాజు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

హాలహర్వి: మండల పరిధిలోని నిట్రవట్టి జిల్లా పరిషత్ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

తుగ్గలి : జొన్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం సునీల్ రాజ్ ఆధ్వర్యంలో పీఎంసీ చైర్మన్ గుంత రఘు 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కృష్ణగిరిలో రైతు ఉత్పత్తిదారుల సంఘానికి మంజూరైన కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి శనివారం ఆయన జిల్లా ఉద్యానశాఖ ఏడీ రామాంజినేయులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి భూమిపూజ చేశారు. తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఐకేపీ ఏరియా కో-అర్డినేటర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఒంటెల చందన్న (ఫైల్)

ఆలూరు: కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన దళిత ఒంటెల చందన్న(40) ఇంటి నుంచి బైక్ బయలుదేరారు. గ్రామ చివరన అతని బైక్‌కు కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో బైక్ పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరీ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామంలో శనివారం సాయంత్రం బోయ ఈరన్న(44) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన బోయ ఈరన్నకు భార్య బోయ లక్ష్మీ, కుమార్తె వీరేశమ్మ, కుమారుడు వినోద్‌కుమార్‌లు ఉన్నారు. సంవత్సరం క్రితం కుమార్తె వీరేశమ్మకు వివాహం జరిపించాడు. ఐదు ఎకరాల పొలంలో వివిధ పంటలు సాగుచేస్తున్నాడు. పంట సరిగా రాకపోవటం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. శనివారం పొలం వెళ్లి వచ్చాక సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు, బంధువులు చెపుతున్నారు. కాగా, ఆత్మహత్య విషయంపై తమ దృష్టికి రాలేదని రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

కోలుకోలేక మృతి

వెల్దుర్తి: మండల పరిధిలోని మంగంపల్లె గ్రామానికి చెందిన రంగస్వామి(57) శనివారం కర్నూలు ఆసుపత్రిలో కోలుకోలేక మృతిచెందాడు. ఈనెల 26న హైవే 44పై మదార్‌పురం వద్ద బైక్ ప్రమాదంలో రంగస్వామి గాయపడ్డ విషయం తెలిసిందే.

మరింత మెరుగ్గా సేవలందించాలి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం
- సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో సమావేశం



సచివాలయ కన్వీనర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ప్రస్తుతం ఎన్నికైన సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా ఉంటూ బాధ్యతతో మెలగాలని, మరింత మెరుగ్గా ప్రజలకు సేవలందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డితో కలిసి వెల్దుర్తి, కృష్ణగిరి మండల నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో వెల్దుర్తి హైవే పక్కనున్న ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లతో తాము పార్టీ గెలుపునకు పాటుపడతామంటూ, ప్రజా సేవలో ముందుంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మించి పథకాలు ప్రజలకందించారన్నారు. అదే ధైర్యంతో తాము ప్రజల ముందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వెళ్తున్నామని చెప్పారు. సంక్షేమంతో ప్రజలు సంతోషంగా ఉన్నారనడానికి తమకు లభిస్తున్న ఆదరణ నిదర్శనమన్నారు. త్వరలో రాబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి, కృష్ణగిరి జెడ్పీటీసీలు దాది పోగు సుంకన్న మాదిగ, కేఈ సుభాషిణి, కృష్ణగిరి మండల కన్వీనర్ వెంకట్రాముడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకుడు బొమ్మన సుబ్బారెడ్డి, వ్యవసాయ మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, వెల్దుర్తి పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావ్, కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చేపల విక్రయాలు ప్రారంభం

పత్తికొండ రూరల్ : మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు చేపల విక్రయాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం స్థానిక తన నివాసం వద్ద మత్స్యశాఖ సహకార సొసైటీ అధ్యక్షుడు బి.మల్లికార్జున, గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చంద్రయ్య, పందికోన ఫిషరీస్ విలేజ్ అసిస్టెంట్ వసంతలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రా పేరుతో ప్రభుత్వం చేపల పెంపకం, విక్రయాలను ప్రోత్సహిస్తోందన్నారు. తుగ్గలి, బొందిమడుగుల ప్రాంతాల్లో రెండు యూనిట్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ధర్మారెడ్డి కుటుంబానికి పరామర్శ

పత్తికొండ: ఇటీవల గుండెపోటుతో మరణించిన టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళీశ్వర రెడ్డి చిత్రపటానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నివాళులర్పించారు. శనివారం ఆమె జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో జరిగిన చంద్రమౌళీశ్వరరెడ్డి వైకుంఠ సమారాధనలో పాల్గొని ఈఓ ధర్మారెడ్డిని పరామర్శించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 1920 (90 ఎంఎల్) ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. కారును సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు.

కార్యకర్తకు పరామర్శ

వెల్దుర్తి: శుక్రవారం రాత్రి వెల్దుర్తి నుంచి స్వగ్రామానికి వెళ్తూ బైక్ ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చెరుకులపాడు వైఎస్సార్ సీపీ కార్యకర్త సుధాకర్‌ను శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని పెన్షనర్ల సంఘ తాలూకా అధ్యక్షుడు ఏపీ వీరన్న శనివారం తెలిపారు. ఆదివారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఆన్‌లైన్ సౌకర్యం ద్వారా అప్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

హోంమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 8న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఆర్.మురహరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాలంకి రామస్వామి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బీఎల్ నారాయణ, వెంకటేష్, ఆఫ్రిది తదితరులు పాల్గొన్నారు.